సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



పోటీలు సరే.. సౌకర్యాలేవీ?

తణుకులో నిర్వహిస్తున్న క్రీడా ఎంపికలు క్రీడాకారులు సహనానికి పరీక్షగా మారాయి. వసతుల కల్పనలో అవకతవకలు కొట్టొచ్చినట్లుగా కనిపించాయి. 8లో ▸



కొండపై 'టోల్' బాదుడు

శ్రీవారి కొండపై సామాన్య భక్తులే టార్గెట్‌గా ద్విచక్ర వాహనాలకు టోల్ రుసుమును రెట్టింపు వసూలు చేస్తున్నారు. అధికారులు **తెలియనట్టు** చోద్యం చూస్తున్నారు. 8లో ▸



గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

వాహన తనిఖీల్లో ముగ్గురు యువకులు గంజాయి రవాణా చేస్తుండగా కైకలూరు రూరల్ పోలీసులు పట్టుకుని 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

అయ్యో.. రొయ్యో!

- రొయ్య ధరలు పతనం
- కౌంట్‌కు రూ.50 నుంచి రూ.90 వరకు తగ్గించేసిన వ్యాపారులు
- అయినా అంతంతమాత్రంగానే కొనుగోళ్లు
- అమెరికాకు ఎగుమతి కాని రొయ్యల ధరలూ తగ్గించేసిన సిండికేట్
- ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.90 వేల వరకు నష్టపోతున్న రైతులు



సాక్షి, భీమవరం: భారత ఉత్పత్తులపై అమెరికా సుంకాలు ఆక్వాపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. దిగుమతులపై 50 శాతం పన్నుతో రొయ్య ధరలు కిలోకు రూ.50 నుంచి రూ.90 వరకూ పతనమయ్యాయి. అమెరికాకు ఎగుమతికాని 50 నుంచి 100 కౌంట్ల రొయ్యల ధరలను సైతం వ్యాపారులు తగ్గించేశారు. అయినప్పటికీ కొనుగోళ్లు అంతంత మాత్రంగానే చేస్తున్నారని రైతులు అంటున్నారు. రాష్ట్రంలోని 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంటే 2.63 లక్షల విస్తీర్ణం, ఏటా దాదాపు మూడు లక్షల టన్నుల రొయ్యల దిగుబడితో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మొదటిస్థానంలో ఉంది. కిలోకు 30 నుంచి 40 కౌంట్ వరకు రొయ్యలు అమెరికాకు, 50 నుంచి 100 కౌంట్ వరకు చైనా, యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2023–24 గణాంకాల ప్రకారం ఏపీలో 10 లక్షల టన్నులు రొయ్యల దిగుబడి వస్తే వాటిలో 3.27 లక్షల టన్నులు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి.

ఏప్రిల్ నుంచే సుంకాల బెడద

ఏప్రిల్ 3న అమెరికా పన్నుల పెంపు ప్రకటనను సాకుగా చూపించి కిలోకు 30 కౌంట్‌కు రూ.460, 40 కౌంట్‌కు రూ.370, 100 కౌంట్‌కు రూ.230 ఉన్న ధరలను ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వాహకులు, ఎక్స్‌పోర్టర్స్, వ్యాపారులు రూ.30 నుంచి రూ.70 వరకు తగ్గించేశారు. పన్నులు పెంపు వాయిదా వేస్తున్నట్టు తర్వాత అమెరికా ప్రకటించినా ధరలు పెంచకుండా నెలరోజులకు పైగా తగ్గింపు ధరలనే కొనసాగించారు. సిండికేట్ దోపిడీ, కూటమి సర్కారు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్లెక్కి ఆందోళనలు చేశారు. ఒక దశలో పశ్చిమగోదావరి జిల్లా రైతులు పిలుపునివ్వగా చాలామంది చెరువులను ఎండగట్టి పంట విరామం పాటిస్తున్నట్టు ఫ్లెక్సీలను సైతం కట్టారు. ఈ పరిణామాలతో ఉలిక్కిపడిన కూటమి ప్రభుత్వం ఉండిలో ఆక్వా సదస్సు, విజయవాడలో ప్రాన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించి మేత ధరలను కేవలం టన్నుకు రూ.4 వేల వరకు తగ్గింపు, స్వల్పంగా రొయ్య ధరల పెంపు వంటి కంటితుడుపు చర్యలతో సరిపెట్టింది.

మళ్లీ పతనం : ఈ ఏడాది ప్రతికూల వాతావరణం, వైరస్‌ల బెడదతో ఆశించిన కౌంట్ రాకుండానే పట్టుబడులు చేయాల్సి వచ్చింది. ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగి 100 కౌంట్ రూ.260–రూ.270 మధ్య, 30 కౌంట్ రూ.470, 40 కౌంట్ రూ.400లతో రైతుల్లో ఆశలు చిగురింపచేశాయి. ఇంతలో భారత ఉత్పత్తులపై ఆగస్టు 1 నుంచి 25 శాతం పన్ను, పెనాల్టీ విధిస్తున్నట్టు అమెరికా ప్రకటించిన 24 గంటల వ్యవధిలో వ్యాపారులు కౌంట్‌ను బట్టి రొయ్య ధరలను రూ.60 వరకు తగ్గించేశారు. అమెరికా పన్నులు సాకుగా చూపించి కేవలం చైనా, యూరప్ దేశాలకు మాత్రమే ఎగుమతయ్యే 50 నుంచి 100 కౌంట్ రొయ్యల ధరలను తగ్గించేశారు.

సుంకాలను 50 శాతం వరకు పెంచినట్టు అమెరికా రెండోసారి చేసిన ప్రకటనతో పరిస్థితి మరింత దిగజారింది. ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయోనన్న ఆందోళనతో కంపెనీలు, వ్యాపారులు చాలా వరకు కొనుగోళ్లు నిలుపుచేశారు. ప్రస్తుతం పట్టుబడులకు వచ్చిన చెరువుల్లో వ్యాపారులు చెప్పిన ధరకే రైతులు అంగీకరించాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దిరోజులు లాభసాటి ధరతో ఆశలు రేకెత్తించిన రొయ్య ధరలు అంతలోనే పతనమవ్వడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎకరాకు రైతులు రూ.40 వేల నుంచి రూ.90 వేల వరకు నష్టపోతున్నారు. డాలర్ ధర పెరిగినప్పుడు ఆ లాభాన్ని పొందే ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఎక్స్‌పోర్టర్లు సుంకాల భారాన్ని తమపై మోపడం సరికాదంటున్నారు. ప్రతికూల వాతావరణం, నాణ్యత లేని సీడు, ఫీడు, వైరస్‌ల బెడద, కాటా మోసాలతో ఇబ్బందులు పడుతుంటే ధరల పతనం తమను మరింత నష్టాల్లోకి నెట్టేస్తోందని వాపోతున్నారు.

పది రోజుల్లో ధరల వ్యత్యాసం
(కిలోకు రూ.లలో)

కౌంట్	పది రోజుల క్రితం	ప్రస్తుతం
100	270	220
90	280	230
80	290	255
70	320	275
60	360	295
50	370	315
40	400	335
30	470	385

కూటమి ప్రభుత్వం విఫలం



ఆక్వా రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు సర్కారు పూర్తిగా విఫలమైంది. అమెరికాకు ఎక్స్‌పోర్టు కాని 50 నుంచి 100 కౌంట్ల ధరలను తగ్గించేసి దోచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. లాభాలు వచ్చినప్పుడు, డాలర్ల విలువ పెరిగినప్పుడు ఆ ప్రయోజనాన్ని వ్యాపారులే పొందుతున్నారు. ఇప్పుడు సుంకాల భారాన్ని రైతులపై మోపడం సరికాదు. ధరల స్థిరీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–వడ్డి రఘురాం,
అప్పడా మాజీ వైస్ చైర్మన్, తాడేపల్లిగూడెం

గిరిజన చట్టాల పరిరక్షణకు
కృషి చేయాలి



ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన నృత్యం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తదితరులు

బుట్టాయగూడెం: గిరిజన చట్టాలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తూర్పు పాలకుంట వద్ద సర్పంచ్ బన్నె బుచ్చిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల ఆచారాలు, సాంప్రదాయాలు, సంస్కృతి, భాష, యాస కట్టుబాట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రపంచం ఆధునికత వైపు పరుగులు పెడుతుంటే గిరిజనులు మాత్రం వెనకకు నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు గిరిజనాభివృద్ధికి పెద్ద పీట వేసారన్నారు. ఆదివాసీ దినోత్సవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని చెప్పారు. పోడు చేసుకుంటున్న సుమారు 2 లక్షల మంది గిరిజనులకు పోడు భూములకు పట్టాలివ్వడమే కాకుండా రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం కూడా అందించారని అన్నారు. గ్రామస్తులతో పాటు బాలరాజు గిరిజన సాంప్రదాయ నృత్యాలు చేశారు. సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, మాల్చి వెంకన్నబాబు, పొడియం లక్ష్మి, నాయకులు బన్నే చంద్రకళ, తెల్లం దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యతోనే అన్నీ సాధ్యం



గిరిజన సంక్షేమశాఖ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ఆర్థికంగా, సామాజికంగా బలపడాలంటే విద్యతోనే సాధ్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుదూరప్రాంతాల నుంచి వస్తున్నవారంతా క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. బ్రిటిష్ పాలనలో గిరిజనులపై చేసిన అరాచకాలను ఎదిరించి నాయకత్వం వహించిన కొమరం భీం ధైర్య సాహసాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖఅధికారిణి డి.పుష్పరాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకులను నియమించాలి

భీమవరం: రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల నుంచి తొలగించిన ఆరోగ్య సహాయకులను పునర్నియామకం చేయాలని పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ కోరారు. గత డిసెంబర్ 5న అధికారులు హడావుడిగా తొలగించిన రాష్ట్రంలోని 920 మంది ఆరోగ్య సహాయకుల కుటుంబాలు దుర్భర పరిస్థితిని అనుభవిస్తున్నారని చెప్పారు. ఆరోగ్య సహాయకులుగా ఉద్యోగాలు చేస్తూ వాటిని కోల్పోయిన వారంతా యాభై ఏళ్ళు వయస్సు పైబడ్డ వారేనని ఇలాంటి తరుణంలో ఉద్యోగాలు తొలగిస్తే వారి కుటుంబాల పరిస్థితి ఏంటనేది ప్రజా ప్రతినిధులు గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా కలుగజేసుకుని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆరోగ్యసహాయకుల ఖాళీల వివరాలను ప్రభుత్వం కోర్టుకు సమర్పించడమేగాకుండా మెరిట్ ఆధారంగా అందరినీ తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

11 నుంచి ఏబీవీపీ కార్యవర్గ సమావేశాలు



మాట్లాడుతున్న ఏబీవీపి కార్యదర్శి వెంకటగోపి

భీమవరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఈనెల 10,11 తేదీల్లో భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు ఏబీవీపి రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకటగోపి చెప్పారు. శనివారం భీమవరంలో సమావేశంలో మాట్లాడుతూ సమావేశాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 250 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. రెండు రోజులపాటు నిర్వహించే సమావేశాల్లో రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలు, సంక్షేమ వసతి గృహాల పరిస్థితులపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు.

శ్రీవారి క్షేత్రంలో డ్రోన్ కలకలం



శ్రీవారి ఆలయ ప్రధాన రాజగోపురంపై ఎగురుతున్న డ్రోన్ కెమెరా

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ ప్రధాన రాజగోపురంపై శనివారం రాత్రి డ్రోన్ ఎగరడంతో కలకలం రేగింది. ఆలయ భద్రతలో భాగంగా దేవాలయంపై డ్రోన్ ఎగరడాన్ని అధికారులు నిషేధించారు. క్షేత్రంలో వివాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఒక డ్రోన్ ఆలయ ప్రధాన రాజగోపురంపై చక్కర్లు కొట్టింది. దాంతో అప్రమత్తమైన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది డ్రోన్ ఎగరవేస్తున్న వ్యక్తిని పట్టుకుని, అతడితో పాటు డ్రోన్‌ను స్థానిక పోలీస్టేషన్‌లో అప్పగించారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): తమ్మిలేరు భూములను ఆక్రమించుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తమ్ములేరు భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.

నేత్రపర్వంగా పవిత్రారోహణ



శ్రీవారి ఆలయంలో దివ్య పవిత్రాలతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయంలో జరుగుతున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం పవిత్రారోహణ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో గత రెండు రోజులుగా విశేష కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఉదయం ఆలయ యాగశాలలో హోమగుండం వద్ద అగ్ని ఆరాధన, చతుర్థ కలశ స్నపనను అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో ఘనంగా జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అలంకరణలు చేసే పవిత్రాలను అర్చకులు శిరస్సుపై పెట్టుకుని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు స్వామివారి వాహనాన్ని భక్తి ప్రపత్తులతో మోశారు. ఆ తరువాత ఆలయ గర్భాలయంలో కొలువైన శ్రీవారి మూలవిరాట్‌కు, అమ్మవార్లకు అలాగే ఉత్సవమూర్తులకు అర్చకులు పవిత్రాలను ధరింపజేశారు. అనంతరం పవిత్రాంగ హోమం, శాంతి హోమాన్ని భక్తుల గోవింద నామస్మరణల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఆదివారం జరిగే పవిత్రావరోహణ, శ్రీ మహా పూర్ణాహుతి వేడుకలతో ఈ పవిత్రోత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. సోమవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తామని, భక్తులు గమనించాలని ఆయన కోరారు.

ఒత్తిడితోనే రికార్డులు మారుస్తున్నారు

పాములపర్రులో కొనసాగుతున్న దళితుల నిరసన



నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

ఉండి: కూటమి నాయకులు ఒత్తిడితోనే అధికారులు రికార్డులు మార్చేస్తున్నారంటూ పాములపర్రు దళితులు, దళిత సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాములపర్రులో వివాదంగా మారిన శ్మశానంలో రోడ్డు నిర్మాణ ఘటనలో ఆందోళనలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. కొద్ది రోజులుగా కూటమి నాయకులు, ఉద్యమాన్ని ఆపేది లేదని దళితులు చెబుతున్నారు. శనివారం సాయంత్రం గ్రామంలో దళితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బహుజన జేఏసీ కన్వీనర్ తాళ్ళూరి మధు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు, జేఏసీ గౌరవాధ్యక్షుడు స్టాలిన్‌బాబు మాట్లాడుతూ పాములపర్రులో ఒకపక్క దళితులు తమ శ్మశాన భూమి కోసం పోరాడుతుంటే మరో పక్క అధికారులు కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఏకంగా రెవెన్యూ రికార్డులనే మార్చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి గానీ, బోర్డు సభ్యులకు గానీ శ్మశాన వాటికకు సంబంధించి సమాచారం లేకుండా పంచాయతీ కార్యదర్శి పై అధికారులు కోరినట్లు తహసీల్దార్‌కు శ్మశాన సరిహద్దులు మార్చాలంటూ లేఖ రాయడం ఏంటని వారు మండిపడ్డారు. తామంతా రాజీపడిపోయామని సమస్య సద్దుమణిగిపోయిందని అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని దళితులు తప్పుపట్టారు. 150 ఏళ్ల నుండి శ్మశానంగా వున్న భూమిని ఎలా మారుస్తారని ఏ విధంగా భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని ప్రశ్నించారు. పక్క గ్రామానికి చెందిన ఇద్దరు ఆక్వా రైతుల ప్రాపకం కోసం అధికారులు, కూటమి నాయకులు ఇంత దారుణానికి ఎలా ఒడిగడతారని మండిపడ్డారు. ఏ అర్హతతో పంచాయితీ కార్యదర్శి లేఖ రాశారని అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీకి సంబంధం లేదు

సరిహద్దులు మార్చాలని పంచాయతీ సమావేశంలో ఎలాంటి చర్చ రాలేదని ఒకటో వార్డు సభ్యుడు దర్శి సాల్మన్ తెలిపారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్న పంచాయితీ కార్యదర్శి అప్పారావుపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఆందోళనలో జేఏసీ రాష్ట్రాధ్యక్షుడు బిరుదుగడ్డ రమేష్ బాబు, దానం విద్యాసాగర్, మామిడిపల్లి ఏసేబు, దర్శి దేవానందం, ఆనందరావు, మత్తి చంద్రం, బడుగు ఆదాము, వజ్రపు సుందరరావు, దర్శి వెంకటరత్నం, దర్శి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు నూతనుత్తేజాన్ని నింపుతాయి



డీఎన్నార్ క్రీడా మైదానంలో పోలీసు లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ అద్నాన్ అస్మి

భీమవరం: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించి వారిలో నూతనుత్తేజాన్ని నింపేందుకు క్రీడలు ఉత్తమ సాధనమని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడామైదానంలో పోలీసు క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో క్రికెట్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్స్, విభాగాల నుంచి ఎస్పీ ఎలెవన్ టీం, నరసాపురం ఎలెవన్ టీం, భీమవరం ఎలెవన్ టీం, తాడేపల్లిగూడెం ఎలెవన్ టీం తలపడుతున్నాయన్నారు. ఎస్పీ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు.

మున్సిపల్ సిబ్బంది టూల్స్ డౌన్

ఏలూరు(టూటౌన్): క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో వహిస్తున్న నిర్లక్ష్య విధానాలకు వ్యతిరేకంగా ఏలూరులో శనివారం నాడు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సెక్షన్ ఉద్యోగ సిబ్బంది టూల్స్ డౌన్ కార్యక్రమాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్‌లను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 11వ పీఆర్సీలో పెండింగ్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డిజిటల్ టెక్నాలజీదే భవిష్యత్తు

నిట్ స్నాతకోత్సవంలో వక్తలు



నిట్‌లో స్నాతకోత్సవ వేదికపై ప్రొఫెసర్లు, అతిథులు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: దేశ భవిష్యత్‌కు డిజిటల్ టెక్నాలజీ ప్రధాన చోదక శక్తిగా మారనుందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్(టెక్నాలజీ అండ్ సాఫ్ట్‌వేర్) వి.రాజన్న సూచించారు. ఏపీ నిట్‌లో విద్యనభ్యసించిన 2021–25 బ్యాచ్ విద్యార్థులకు ఏడో స్నాతకోత్సవాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇన్‌చార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఇంజనీర్లేనని చెప్పారు. విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆయా రంగాల్లోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆరోగ్యమే సంపద అని, విద్యార్థులు నిత్యం యోగా, వ్యాయామం, నడక, పరుగు, క్రీడల వంటి వాటి కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. డాక్టర్ ఎన్వీ రమణారావు మాట్లాడుతూ దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. కంపెనీలకు అవసరాలకు తగ్గటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 667 మంది విద్యార్థులకు డిగ్రీలు, 29 మందికి డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. బయో టెక్నాలజీ ఇంజినీరింగ్ నుంచి శశాంక్ 9.33 గ్రేడ్‌పాయింట్లు, కెమికల్ ఇంజనీరింగ్ నుంచి సంగెపు అభినవ్ 8.82, సివిల్ ఇంజినీరింగ్ నుంచి తమ్ముహరిత 9.44, కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజినీరింగ్ నుంచి కలిదిండి పవన్ తేజ సత్యవర్మ 9.70, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ నుంచి ఆదిత్య ప్రతాప్ సింగ్ 9.42, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నుంచి చిత్తిడి ధనుషా లక్ష్మి దుర్గా 9.48, మెకానికల్ నుంచి వుడుముడి ప్రియాంకకు 9.33, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ నుంచి జయస్మిత కే ప్రదాన్‌కు 9.07 గ్రేడ్ పాయింట్లు సాధించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్‌లు డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, సెనేట్ సభ్యులు, విభాగాధిపతులు, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త కావడమే లక్ష్యం



కంప్యూటర్ సైన్స్‌లో 9.70 గ్రేడ్ పాయింట్లు సాధించి టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. బెంగళూరులోని ఐఐఎస్సీలో ఎంటెక్ చేస్తున్నా. వినూత్న ఆలోచనలు చేయడంతో పాటు అర్థం చేసుకొని చదవడం అలవాటు. సందేహాలు ఉంటే ప్రొఫెసర్లను అడిగి నివృత్తి చేసుకునే వాడిని. శాస్త్రవేత్తగా రాణించాలన్నదే నా లక్ష్యం

– కలిదిండి పవన్ తేజ సత్యవర్మ, భీమవరం

కల సాకారమైంది



కెమికల్ ఇంజనీరింగ్‌లో 8.82 గ్రేడ్ పాయింట్లు సాధించడం గర్వంగా ఉంది. ప్రస్తుతం ఐఐఎస్సీలో ఎంటెక్ చదువుతున్నాను. తరగతిలో అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని తల్లిదండ్రులు ఎంతగానో ప్రోత్సహించారు. వారి కలను సాకారం చేసినందుకు ఎంతో సంతృప్తిగా ఉంది.

– సంగెపు అభినవ్, వైజాగ్

సాంకేతికతపై పట్టు సాధించాలి



ప్రస్తుతం నేను అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ రూ.19 లక్షలు వేతనాన్ని పొందుతున్నాను. కలలను సాకారం చేసుకోవాలన్న ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలన్నా, ఏ రంగంలోనైన స్థిరపడాలన్న ఆధునాతన సాంకేతికతలపై పట్టు సాధించాలి. గూగుల్ కంపెనీలో ఉద్యోగం సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలన్నదే నా లక్ష్యం.

– చిత్తడి ధనుషా లక్ష్మీదుర్గ, నిడదవోలు

పాఠ్యాంశాలు శ్రద్ధగా వినాలి



ప్రస్తుతం నేను మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌డీ చేస్తున్నాను. బయో ఇంజనీరింగ్‌లో 9.33 గ్రేడ్ పాయింట్లు సాధించడం ఆనందంగా ఉంది. పాఠ్యాంశాలను శ్రద్ధగా విన్నాను. ప్రతి ఒక్కరు గ్రంథాలయానికి ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమీషన్‌లో ఉద్యోగం సంపాదించాలన్నదే నా జీవితాశయం.

–శశాంక్, కర్నాటక

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



సివిల్ ఇంజనీరింగ్ 9.44 గ్రేడ్ పాయింట్లు సాధించాను. ప్రస్తుతం చెన్నైలోని ఎల్ అండ్ టి కంపెనీలో త్రీడీ మోడలింగ డిజైనర్‌గా పనిచేస్తున్నాను. ఒక్కొక్క మెట్టు పైకెక్కుతూ ఉన్నత స్థాయికి వెళ్ళి మంచి అధికారిణిగా స్థిరపడాలన్నదే నా లక్ష్యం. నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు.

– తమ్ము హరిత, అవనిగడ్డ

అవగాహన పెంచుకోవాలి



మెకానికల్ ఇంజనీరింగ్‌లో 9.33 గ్రేడ్ పాయింట్లు సాధించాను. ప్రస్తుతం ఎల్ అండ్ టీ కంపెనీలో ఉద్యోగం చేస్తూ రూ.6 లక్షల వేతనాన్ని అందుకుంటున్నాను. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతోపాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగం సాధించాలన్నదే నా ధ్యేయం.

– వుడుముడి ప్రియాంక, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

శ్రీవారికి హారం సమర్పణ





దాత రాధాకృష్ణకు రశీదును అందజేస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు, ఇన్‌సెట్‌లో బంగారు లక్ష్మీదేవి కాసుల హారం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఒక భక్తుడు శనివారం సుమారు రూ.7 లక్షలు విలువ చేసే 65 గ్రాముల బంగారు లక్ష్మీదేవి కాసుల హారాన్ని బహుకరించారు. విజయవాడకు చెందిన దాసరి రాధాకృష్ణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ హారాన్ని ఆలయ కార్యాలయంలో ఏఈఓ పి.నటరాజారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆయన సంబంధిత రసీదును అందజేశారు.

శ్రీవారి క్షేత్రం.. భక్త జనసంద్రం




ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం శనివారం భక్త జనసంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైనరోజు, రాఖీ పండుగ కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణ కట్ట, ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లు, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని వేదికపై ఎన్‌టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మండలానికి చెందిన శ్రీ రామాంజనేయ భజన సమాజం సభ్యులు నిర్వహించిన భజనలు భక్తులను అలరించాయి.

శ్రీవారి కొండపై 'టోల్' బాదుడు

- సామాన్య భక్తులే టార్గెట్‌గా దోపిడీ
- ద్విచక్ర వాహనాలకు రెట్టింపు రుసుం వసూలు
- చోద్యం చూస్తున్న అధికారులు.. ముక్కున వేలేసుకుంటున్న భక్తులు



ద్వారకాతిరుమలలో టోల్‌గేట్ మీదుగా కొండపైకి వెళుతున్న భక్తుల వాహనాలు



ద్విచక్ర వాహనానికి ఇచ్చిన రూ.20 టోల్ రశీదు



టోల్‌గేటు వద్ద ఉన్న టోల్ రుసుముల బోర్డు

ద్వారకాతిరుమల : శ్రీవారి కొండపై సామాన్య భక్తులే టార్గెట్‌గా వారు వేసుకొచ్చే ద్విచక్ర వాహనాలకు టోల్ రుసుమును రెట్టింపు వసూలు చేస్తున్నారు. బహిరంగంగా జరుగుతున్న ఈ దోపిడీని అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ తెలియనట్లు చోద్యం చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి కొండపైకి వివిధ వాహనాలపై వెళ్లే భక్తుల నుంచి టోల్ రుసుమును రెండేళ్ల పాటు వసూలు చేసుకునే హక్కుకు గతేడాది జూలైలో దేవస్థానం బహిరంగ వేలాన్ని నిర్వహించింది. పాట దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం తొలి ఏడాది సుమారు రూ. కోటి 60 లక్షలను దేవస్థానానికి చెల్లించాడు. ఈనెల 1 నుంచి రెండో ఏడాది మొదలైంది. ఈ సంవత్సరం జీఎస్టీతో కలిపి సుమారు రూ. కోటి 80 లక్షలను చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కొంత సొమ్మును మాత్రమే జమ చేశారు. ఇదిలా ఉంటే ద్విచక్ర వాహనానికి రూ.10 వసూలు చేయాల్సిన కాంట్రాక్టర్, డబుల్ రుసుముగా రూ.20 వసూలు చేస్తున్నారు. ఇదేం దారుణమంటూ ద్విచక్ర వాహనాలపై వస్తున్న భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు.

దేవస్థానం నిర్ణయించిన ధరలు ఇవీ

దేవస్థానం నిర్ణయించిన ధరల ప్రకారం లారీ, బస్సు, ఇతర భారీ వాహనానికి రూ.150, మినీ బస్సు, (407) వ్యాన్ స్వరాజ్, మజ్దూర్ వాహనానికి రూ.100, ట్రాక్టరు (ట్రక్కుతో), ట్రక్కు ఆటో, తుఫాన్, టాటా ఏస్, ట్రాక్టర్ ఇంజన్, కారు, జీపు, వ్యాన్‌కి రూ.50, పాసింజర్ ఆటోకి రూ. 25, స్కూటర్, మోటర్ సైకిల్‌కి రూ.10 వసూలు చేయాలి. అయితే సామాన్య భక్తులు వచ్చే ద్విచక్ర వాహనాలకు దేవస్థానం నిర్ణయించిన ధరకంటే రెట్టింపు ధరను వసూలు చేస్తూ, భక్తులను దోచేస్తున్నారు.

ధరల బోర్డుకు మొక్కలు అడ్డుపెట్టి మరీ

భక్తులకు వాహనాల టోల్ రుసుములు కనిపించకుండా తెలివిగా టోల్‌గేటు వద్ద ఉన్న ధరల బోర్డుకు మొక్కలు అడ్డుపెట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడుతున్నారు. ఇది ఎప్పటి నుంచి జరుగుతుందో తెలియదు గానీ, శనివారం శ్రీవారికి ప్రీతికరమైనరోజు, రాఖీ పండుగ, క్షేత్రంలో అధికంగా వివాహాలు జరగడంతో వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై వచ్చిన భక్తుల నుంచి ఈ రెట్టింపు రుసుములను వసూలు చేశారు. దీనిపై సంబంధిత సెక్షన్ ఏఈఓ రమణరాజును వివరణ కోరగా టోల్ రుసుములు అధికంగా వసూలు చేస్తున్నారన్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. విచారించి తగు చర్యలు చేపడతామన్నారు.

రూ.20 తీసుకున్నారు



ఫ్యామిలీతో బైక్‌పై వచ్చాను. కొండపైన టోల్‌గేటు వద్ద రూ.20 వసూలు చేశారు. గతంలో వచ్చినప్పుడు రూ.10 తీసుకున్నారు. ధరలు పెంచారని అనుకున్నాను. తీరా కొండపైకి వచ్చిన తరువాత టోల్ నిర్వాహకులు రెట్టింపు ధర వసూలు చేస్తున్నారని తెలిసింది.

– అంగిరేకుల రమేష్, భక్తుడు, రాట్నాలకుంట, పెదవేగి మండలం

అధికారులు ఏం చేస్తున్నారు



దూరాన్ని సైతం లెక్కచేయకుండా ద్విచక్ర వాహనాలపై క్షేత్రానికి వచ్చేది సామాన్య భక్తులే. అటువంటి సామాన్య భక్తులను దోచేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు. ఇదంతా వారికి తెలియకుండానే జరుగుతుందా.? మరీ ఇంత దారుణమా.

– చీకటి విజయభాస్కర్, నాగుపల్లి, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

అడుగుదామంటే..



తరచూ నేను టీవీఎస్ మోపెడ్‌పై శ్రీవారి క్షేత్రానికి వస్తుంటాను. గతంలో టోల్ రుసుము రూ.10 మాత్రమే తీసుకునేవారు. ఇప్పుడు రూ.20 తీసుకున్నారు. ఇదేంటని అడుగుదామంటే వెనుక వాహనాలు నిలిచిపోయాయి. దాంతో ముందుకెళ్లిపోయాను.

– గురజాల ధర్మారావు, నీలాద్రిపురం, ఉంగుటూరు మండలం

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో తీవ్ర గాయాలైన వ్యక్తి

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సు ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం తణుకులో చోటుచేసుకుంది. దువ్వ గ్రామానికి చెందిన యార్లగడ్డ రవి ద్విచక్ర వాహనంపై తణుకువైపు రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతానికి వచ్చేసరికి ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి కాలు నుజ్జయిపోవడంతో మొదట తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి, మెరుగైన వైద్యసేవల కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లుగా తెలిసింది. బాధితుడు తణుకు కోర్టులో ప్లీడరు గుమస్తాగా విధులు నిర్వర్తిస్తుంటారని పోలీసులు చెబుతున్నారు. తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడిపై కత్తితో దాడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్నేహితుడిపై ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం హనుమాన్ నగర్‌కు చెందిన కృష్ణవరపు ఆంజనేయ వరప్రసాద్ స్థానికంగా కారు డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పేరాడ శివాజీ ఇతనికి చిన్ననాటి నుంచి స్నేహితుడు. శనివారం వీరిద్దరి మధ్య చిన్న విషయంపై మాటమాట పెరిగింది. దీంతో ఆంజనేయ వరప్రసాద్‌పై శివాజీ కత్తితో దాడి చేశాడు. గమనించిన ప్రసాద్ బంధువులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రసాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

నిందితుల నుంచి 2.5 కిలోల గంజాయి స్వాధీనం



కైకలూరు సీఐ కార్యాలయంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వారితో సీఐ, ఎస్సైలు

కైకలూరు: వాహన తనిఖీల్లో ముగ్గురు యువకులు గంజాయి రవాణా చేస్తుండగా కైకలూరు రూరల్ పోలీసులు వారిని పట్టుకుని 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ వి.రవికుమార్ కేసు వివరాలను శనివారం వెల్లడించారు. కైకలూరు మండలం ఆలపాడు కోఆపరేటివ్ బ్యాంకు ఎదురు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా శుక్రవారం ముగ్గురు యువకులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారన్నారు. వీరిలో భుజబలపట్నం శివారు సింగాపురం గ్రామానికి చెందిన గురివెల్లి బాలసాయి రామిరెడ్డి(27) వైజాగ్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న రోజుల్లో గంజాయికి అలవాటు పడ్డాడు. మలేషియా, హైదరాబాదు, విజయవాడ ప్రాంతాల్లో హోటళ్లలో పనిచేశాడు. ఇతను 2022లో అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసు స్టేషన్‌లో గంజాయితో పట్టుబడిన కేసులో జైలు శిక్ష అనుభవించాడు. అలాగే ఇటీవల ఆకివీడులో ఇతని స్నేహితులు పవన్‌కుమార్ మరికొందరిని గంజాయి విక్రయాల కేసులో అరెస్టు చేశారు. చటాకాయి గ్రామానికి చెందిన జయమంగళ లక్ష్మీనారాయణ(26) డిగ్రీ వరకు చదివి కూలీపనులకు వెళుతూ మత్తుకు అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్నాడు. కైకలూరు వెలంపేటకు చెందిన నరహరిశెట్టి వెంకట అవినాష్(27) చెన్నైలో బీటెక్ చదువు మధ్యలో ఆపివేసి కైకలూరు లారీ ట్రావెల్స్‌లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఇతను కూడా గంజాయి మత్తుకు బానిసై డబ్బు కోసం ఇతరులకు విక్రయిస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డీపీఎస్) యాక్టు – 1985 ప్రకారం గంజాయి కేసులో 20 సంవత్సరాల శిక్ష పడే అవకాశం ఉందన్నారు. గంజాయి వివరాలు తెలిస్తే 1972, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై వి.రాంబాబు, ట్రైనీ ఎస్సై ఎం.హరిగోపాల్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పెచ్చులు ఊడిపడుతున్న శ్లాబ్



నూజివీడు ఏరియా ఆసుపత్రిలో వార్డుల వద్ద పెచ్చులు ఊడిపోయిన శ్లాబ్

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శ్లాబ్ భాగం నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. పాత బిల్డింగ్‌లో రెండో అంతస్తులోని వార్డుల సమీపంలో శ్లాబ్ పెద్దపెద్ద పెచ్చులు ఊడి పడుతుండటంతో రోగులు, నర్సులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎవరి నెత్తిన పెచ్చులు పడతాయేమోనని బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోగులు, వారి బంధువులు, ఆసుపత్రి సిబ్బంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, పెచ్చులు ఊడుతున్న చోట కనీసం మరమ్మతులు కూడా చేయించకుండా వదిలేశారని రోగులు, ఆసుపత్రి సిబ్బంది వాపోతున్నారు.

నల్లీక్రీక్‌లో పడి యువకుడి దుర్మరణం



గణేష్ మల్లేశ్వరరావు మృతదేహం

నరసాపురం రూరల్: సముద్ర తీరప్రాంత గ్రామమైన నల్లీక్రీక్‌లో పడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం పట్టణంలోని గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన గట్టెం గణేష్ మల్లేశ్వరరావు ముగ్గురు స్నేహితులతో కలసి శుక్రవారం మధ్యాహ్నం వేములదీవి బీచ్‌కు వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి వస్తూ చినలంకలోని నల్లీక్రీక్ వద్దకు వచ్చి అక్కడ కాళ్లు కడుక్కుంటూ ప్రమాదవశాత్తూ కాలు జారి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా మధ్యాహ్నం నల్లీక్రీక్ బ్రిడ్జ్ ప్రాంతంలో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గణేష్ మల్లేశ్వరరావు తల్లి కుమారి ఫిర్యాదు మేరకు ఏఎస్సై కె శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు

కాళ్ల: మండలంలోని కలవపూడి గ్రామంలోని పంట కాలువలో వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై కాళ్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కలవపూడి గ్రామానికి చెందిన గొట్టుముక్కల సత్యవతి (75) ఇటీవల కేన్సర్ వ్యాధితో బాధపడుతూ ఉండేది. వ్యాధి నొప్పి భరించలేక చనిపోవాలనిపిస్తోందని ఇటీవల పిల్లల వద్ద వాపోయింది. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంటిలోని గదిలో పడుకున్న ఆమె తెల్లారేసరికి లేకపోవడం, చుట్టుపక్కల వెతకగా పంట కాలువలో శవమై తేలింది. దీనిపై కుమారుడు వెంకటరామరాజు ఫిర్యాదు మేరకు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడా పోటీలు సరే.. సౌకర్యాలేవి?

- ఆకలితో అలమటించిన క్రీడాకారులు
- తినుబండారాల కోసం దుకాణాల వెంబడి పరుగులెత్తిన వైనం
- ప్రమాదకరంగా క్రీడా ప్రాంగణం



తణుకులో జెడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో గడ్డిదుబ్బులతో ఉన్న ప్రాంతంలో హాకీ ఆడుతున్న క్రీడాకారులు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో ఆకలి, నీరసంతో హోటల్‌కు వెళ్తున్న క్రీడాకారులు

తణుకు అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తణుకులో నిర్వహిస్తున్న క్రీడా ఎంపికలు క్రీడాకారులు సహనానికి పరీక్షగా మారాయి. జిల్లా అధికారులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ క్రీడా ఎంపికల్లో విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనలో అవకతవకలు కొట్టొచ్చినట్లుగా కనిపించాయి. తణుకు వేదికగా జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు క్రీడాకారుల ప్రతిభకే కాకుండా వారికి తీవ్ర అసహనాన్ని కల్పించాయి. ముఖ్యంగా క్రీడా ఎంపికలకు వచ్చిన క్రీడాకారులకు మంచినీరు తప్ప మరే ఆహారం ఇవ్వకపోవడంతో వారంతా ఉక్కపోత వాతావరణానికి ఓ పక్క నీరసం, మరో పక్క ఆకలితో నకనకలాడారు. మధ్యాహ్నం 1 గంటకు ఎంపికలు పూర్తయినే వెంటనే రాష్ట్రపతి రోడ్డులో ఉన్న దుకాణాల వద్దకు పరుగులు పెట్టారు. చేతిలో డబ్బులు ఉన్న క్రీడాకారులు ఆకలి తీర్చుకోగా మిగిలిన వారు ఒకరి ముఖం ఒకరు చూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా క్రీడలకు సైతం పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రీడాకారులు శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హాకీ క్రీడకు సంబంధించి భీమవరం, శృంగవృక్షంకు చెందిన క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రీడా ప్రాంగణంలో ఉన్న గడ్డి దుబ్బులతో బాల్ గమనంపై సరిగా దృష్టిసారించలేకపోవడంతో పడిపోయిన సందర్భాలు కూడా ఎదురయ్యాయని క్రీడాకారులు వాపోయారు. భోజన వసతులు లేకపోవడంతో బ్యాగ్‌లు మోసుకుంటూ వెళ్లి మెస్‌లలో భోజనం చేయాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. క్రీడా అసోసియేషన్‌లు ఏర్పాటుచేసే ఎంపికలకే అన్ని ఏర్పాట్లు చేస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.

అండర్ 22లోపు..

తణుకులో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, మాంటిస్సోరీ స్కూలులో ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజులపాటు అండర్ 22 లోపు క్రీడాకారులకు 10 క్రీడాంశాల్లో ఈ క్రీడా ఎంపికలు నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ క్రీడా ఎంపికల్లో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హాకీ, ఆర్చరీ, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మొదటిరోజు 82 మంది క్రీడాకారులు హాజరుకాగా, రెండోరోజైన శనివారం 125 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆదివారంతో ఈ క్రీడా ఎంపికలు ముగియనున్నాయి. శనివారం ఆర్చరీకి సంబంధించి జోనల్ స్థాయి పోటీలకు 24 మందిని, అథ్లెటిక్స్‌లో 20, బాస్కెట్‌బాల్ 24, బాక్సింగ్ 25, హాకీలో 32 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.రాజేష్ తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర'తో సౌకర్యాలు ఫుల్...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించి నాణ్యమైన క్రీడాకారులను వెలికితీయాలనే ఉద్దేశ్యంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంతో క్రీడాకారులకు చక్కని సౌకర్యాలతో క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలకు వచ్చేవారికి అల్పాహారంతోపాటు భోజన వసతి కూడా కల్పించారు. క్రీడలకు సంబంధించి క్రీడా పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయడం, విజేతలకు ధ్రువపత్రాలు, మెమెంటోలు, మెడల్స్‌తోపాటు భారీ నజరానా కూడా అందజేశారు.

సంస్కృతికి వేదాలు మూలం



వేద పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

గణపవరం: వేదాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలమని, వేదాల పరిరక్షణకు వేద విద్యార్థులు కృషి చేయాలని పండితులు, ఘనాపాఠీలు సూచించారు. సరిపల్లెలోని సఖ్యాభివర్ధక నిలయంలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన 105వ వేద శాస్త్ర పరిషత్ కార్యక్రమం శనివారం ముగిసింది. దేశం నలుమూలల నుంచి 138 మంది వేద విద్యార్థులు హాజరుకాగా వీరికి 14 మంది వేదపండితులు, ఘనాపాఠీలు పరీక్షలు నిర్వహించారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాల్లో అభ్యర్థులకు రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు శనివారం నిర్వహించిన వేదపరిషత్ సభలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సాగిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులు దెందుకూరి ప్రసాదరాజు , దెందుకూరి వర్మ దంపతులు ఈకార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేద పండితులు, ఘనాపాఠీలకు పండిత సత్కారం నిర్వహించారు. గాయత్రిబ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు శాపంగా కూటమి పాలన



మాట్లాడుతున్న తుమరాడ స్రవంతి, నేతలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన మహిళల పాలిట శాపంగా మారిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వమే స్వయంగా మద్యం విక్రయాలు ప్రోత్సహించడం దారుణమన్నారు. విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేయడంతోపాటు పర్మిట్ రూమ్‌లకు క్లియరెన్స్ ఇవ్వడం విచారకరమన్నారు. పెరుగుతున్న మద్యం వినియోగం చాలా కుటుంబాల్లో చిచ్చు పెడుతోందని, ఇది మహిళలకు తీరని వేదన మిగులుస్తోందన్నారు. రాష్ట్రం అంతటా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టారని, ఒక ఏడాది ఈ పథకం పూర్తిగా ఎగ్గొట్టి, ఇప్పుడు అమలు చేస్తున్నామని చెబుతున్న దానిలో కూడా అనేక కొర్రీలు పెట్టారని మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, ఏలూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జుజ్జువరపు విజయనిర్మల, జిల్లా కార్యదర్శి కంచుమర్తి తులసి, కార్పొరేటర్ డింపుల్ జాబ్, పోల్నాటి పరమేశ్వరి దేవి, మహిళా నేతలు పాల్గొన్నారు.

11 నుంచి జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని అండర్–22 విభాగంలో మహిళలు, పురుషులకు 10 క్రీడాంశాల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11, 13 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. 11 తేదీన జంగారెడ్డిగూడెంలో ఆర్చరీ, ఏలూరు భిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్‌పూల్‌లో స్విమ్మింగ్, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాడ్మింటన్, ఖండ్రికగూడెం బాక్సింగ్ ఆకాడమీలో బాక్సింగ్ పోటీలు, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ ఖోఖో, వాలీబాల్ పోటీలు, ఇండోర్ స్టేడియంలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు చేపడతామని వెల్లడించారు. తిరిగి 13న ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ నిర్వహిస్తామని వివరించారు. వివరాలకు 98663 17326 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



ఏసురాజు (ఫైల్)

ముదినేపల్లి రూరల్: విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి చెందిన ఘటన ముదినేపల్లిలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఎం ఏసురాజు(13) స్థానిక జెడ్పీహైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. అతడి తల్లి సమీపంలోని ఇంట్లో పనిచేస్తుండగా అక్కడకు బాలుడు కూడా వెళ్లాడు. తల్లి ఇంట్లో పని చేస్తుండగా నీళ్లు పట్టేందుకు బాలుడు కరెంటు మోటార్ ఆన్ చేశాడు. దీంతో ఒక్కసారిగా షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి అకాలమరణంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

క్లుప్తంగా

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కడకట్ల శివారు ఎస్టీ యానాది కాలనీలో బీజేపీ ఎస్టీ మోర్చ అధ్యక్షుడు సింగం జగపతి రామయ్య ఆధ్వర్యంలో శనివారం ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యానాది కులస్తులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతమ్మ తల్లికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అనంతమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేఎస్ఎన్ కాలనీ అనంతమ్మ తల్లికి శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా శనివారం విశేష పూజలు జరిగాయి. కేఎస్ఎన్ కాలనీ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. దాతలు చోడగిరి పెద్దబాబు, చిన్నబాబు, కాలనీ పెద్ద జొన్నల అన్నవరం సత్యనారాయణలు పర్యవేక్షించారు.

వరాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఉసూరుమనిపించిన వర్షం



తాడేపల్లిగూడెం పట్టణంలో శనివారం రాత్రి కురుస్తున్న వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షం ప్రజల్ని ఉసూరు మనిపించింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం పది నిమిషాలపాటు కురిసింది. తదుపరి ముఖం చాటేసింది. గత పది నుంచి పదిహేను రోజులుగా భానుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. భీకరమైన ఎండలు కాయడంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారు. దీంతో మందుల షాపులు, ఆసుపత్రులకు ప్రజలు క్యూకడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో వర్షం కురి సింది. అయితే, ఈ వర్షం ఏ మాత్రం భూతాపాన్ని తగ్గించకపోగా, ఉక్కపోతను కలుగజేయడంతో ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు.

వసతిగృహాల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు అర్బన్: వసతి గృహాల్లో అందుతున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగపరచుకుని మంచి స్థాయికి చేరుకోవాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం తణుకు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో హాస్టల్ వార్డెన్ కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వసతి గృహాల్లోని విద్యార్థులంతా విద్యకు ప్రాధాన్యతనిస్తూ క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా అధికారి సాంబమూర్తి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కేవీ సత్యనారాయణ, రిటైర్డు హెచ్‌డబ్ల్యూ సూర్యారావు, కళాశాల హెచ్‌డబ్ల్యూవో జి.సూర్యచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

తణుకు అర్బన్: మద్యం, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు బానిసైన వారు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుందని కేర్ కమిటీ వైద్యులు డాక్టర్ నిమ్మల సత్యనారాయణ, డాక్టర్ శీలం అశ్విన్‌కుమార్ అన్నారు. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సాయిశ్వేత హాస్పిటల్‌లో శనివారం కేర్ కమిటీ వైద్యులు ఆల్కహాల్ డ్రగ్స్ వలన కలిగే దుష్ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో కందిపప్పు నిల్

- ఏడాదిగా పంపిణీ చేయని కూటమి ప్రభుత్వం
- ప్రతినెలా లబ్ధిదారుల ఎదురుచూపులు.. ఆపై తీవ్ర నిరాశ
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు



రేలంగిలోని రేషన్ షాప్



రేలంగిలోని రేషన్ షాపులో కందిపప్పు అడుగుతున్న లబ్ధిదారులు

ఇరగవరం: కూటమి ప్రభుత్వం పేదోడికి పప్పన్నం కరువైంది. తాము అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు పేదలకు కిలో కందిపప్పు కూడా రేషన్ షాపుల ద్వారా అందజేయలేక పోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఇంటి వద్దకే రేషన్‌ను రద్దు చేసిన సర్కారు నిర్ణయంతో రేషన్ షాపుల వద్ద జనం క్యూలు కట్టి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ డిపోల్లో అన్ని నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు దొరికేలా మాల్స్‌లా తీర్చుదిద్దుతామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన కూటమి నాయకులు పేద, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన కందిపప్పు సరఫరా చేయలేకపోతున్న పరిస్థితి. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. గత ప్రభుత్వంలో బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి, రాగుల పిండి పంపిణీ చేశావారని, కిలోరూ.67కే కందిపప్పు ఇచ్చేవారని జనం గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రేషన్ డిపోల ద్వారా కందిపప్పు ఎప్పటి నుంచి ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు.

ఏడాదిగా ఎదురుచూపులే..

తణుకు నియోజకవర్గంలో తణుకు 42,062, అత్తిలి మండలంలో 21,268 ,ఇరగవరం 21,164 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. సుమారు రెండున్నర లక్షల జనాభా ప్రతినెల రేషన్ డిపోలో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెల కార్డుదారులు కందిపప్పు వచ్చిందా... ఎప్పుడొస్తుంది..అసలు ఇస్తారా లేదా అని ప్రశ్నలు అడుగుతుంటే ఏమీ సమాధానం చెప్పాలో తెలియక రేషన్ డీలర్లు తెల్లమొహం వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.140 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోంది. అంత ధర పెట్టి కొనలేని ప్రజలు రేషన్ షాపులో ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈనెల కాకపోతే వచ్చే నెల ఇస్తారని ఆశపడుతూ వస్తున్న మహిళలకు ఏడాదిగా ఎదురు చూపులే మిగిలాయి.

అడిగితే కసురుతున్నారు



ఎన్నికల ముందు అన్ని సరుకులు రేషన్ షాపుల్లో దొరికేలా చూస్తామన్నారు. ఇప్పుడేమో కందిపప్పు రాలేందంటున్నారు. ప్రతి నెల కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నాం. డీలర్ మాత్రం రాలేదు, వస్తే ఇవ్వమా అని కసురుకుంటున్నారు. గతంలో ఇంటింటికీ రేషన్ బండి ద్వారాబియ్యం, పంచదార, కందిపప్పు, గోదుమ, రాగిపిండి ఇచ్చేవారు. ఏడాదిగా బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు.

– దొంగ శ్రీను, ఇరగవరం మండలం, కొత్తపాడు

కందిపప్పు లేదంటున్నారు



రేషన్ డిపోలో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే రాలేదని డీలర్ చెబుతున్నారు. బయట మార్కెట్‌లో కిలో రూ.150 వరకు పలుకుతోంది. అంత ధర పెట్టి కొనలేక పోతున్నాం. గతంలో కిలో రూ.67కు కందిపప్పు ఇచ్చేవారు. ఏడాది కాలంలో కందిపప్పు రేషన్‌లో ఇవ్వడం లేదు. పాలకులు ఆలోచించి పేదలకు కందిపప్పు సరఫరా చేయాలి.

– కోవ్వూరి శ్రీనివాస్‌రెడ్డి, ఇరగవరం మండలం, ఏలేటిపాడు.

సామాజిక సేవలకు ఆర్సీడీఎస్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి కమ్యూనిటీ సొసైటీ నాయకులు

పెంటపాడు: రెడ్డి కులస్తుల అభివృద్ధితో పాటు, ఇతర సామాజిక వర్గాల అభ్యున్నతికి రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ (ఆర్సీడీఎస్) సొసైటీ పనిచేస్తుందని ఆ సంఘ నేషనల్ చైర్మన్ వల్లపురెడ్డి వెంగళరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ముదునూరుపాడులో ఆర్సీడీఎస్ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారితో కలిసి నూతనంగా ఏర్పాటైన సంఘ కండువాలు ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా రెడ్డి కమ్యూనిటీ సొసైటీ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ రీజినల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీ స్టేట్ కోఆర్డినేటర్ చిర్ల వెంకట సత్యనారాయణరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు హైమావతి, రవికుమార్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, రాంబాబు రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, శేషారెడ్డి, అప్పిరెడ్డి, సతీష్‌రెడ్డి, దానిరెడ్డి, నర్సిరెడ్డి, రామ్‌చరణ్‌రెడ్డి, రత్నావతి, కుసుమాంబ తదితర రెడ్డి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వైఫల్యాలను ఎండగట్టాలి

కాఫీ విత్ కారుమూరి కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి



తణుకులో పార్టీ నాయకులతో మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సీఎం చంద్రబాబు మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు 23వ వార్డు ఇన్‌చార్జ్, జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ దాట్ల సుందరరామరాజు నివాసంలో శనివారం కాఫీ విత్ కారుమూరి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాన్ని ఏపీ ప్రజానీకం పూర్తిగా గుర్తించారని, ఏ గడపలోకి వెళ్లినా కూటమి ప్రభుత్వంపై శాపనార్థాలు పెడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అమల్లోకి వచ్చిన రోజు నుంచి సంక్షేమం ఇవ్వకపోగా ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే గొంతునొక్కే ధోరణితోపాటు దాడులు, కేసులకు తెర తీయడంతో ప్రజలు గుట్టుగా ఉన్నారన్నారు. నేడు ఆ పరిస్థితులు పోయాయని ఏ గడపలోకి వెళ్లినా జగన్ ఉన్నప్పుడే బాగుండేదని ఈ ప్రభుత్వం వచ్చాక ఏ సహకారం లేకుండా పోయిందంటూ దుమ్మెత్తిపోస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏమి ఒరగబెట్టిందని సుపరిపాలన తొలి అడుగు అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారని ప్రశ్నించారు. భవిష్యత్తులో ప్రజలు ఎదురుతిరిగి తరిమి కొట్టే రోజులు రానున్నాయని అన్నారు. పార్టీ శ్రేణులంతా ఇకపై ప్రజల్లోనే ఉంటూ వారికి రావాల్సిన సంక్షేమాన్ని అందించేలా పోరాడాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు చేస్తున్న అరాచకాలు, మోసం, వంచన ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా పనిచేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ 6నెలల వ్యవధిలో 90 శాతం అమలుచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మోహర్ అన్సారీ, మమత, వీరమల్లు ఫణీంద్రకుమార్, పుల్లెపు సూర్యచంద్రరావు, బిరుదుకోట చింతన్న, గెద్దాడ శ్రీకాంత్, గారపాటి సత్యనారాయణ, యారబాటి రామకృష్ణ, షేక్ జిలానీ, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పండుగ అనురాగానికి ప్రతీక



తణుకులో మాజీ మంత్రి కారుమూరికి రాఖీ కడుతున్న అన్సారీ



రాఖీ కడుతున్న చిన్నారి

తణుకు అర్బన్: అన్నా చెల్లెళ్ల అనురాగం, అన్నా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీపౌర్ణమి నిలుస్తుందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆడబిడ్డలందరూ పిల్లాపాపలతో చల్లగాఉండాలని ఆకాంక్షించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే రాఖీ పండుగను తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తణుకు నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, మమత యాదవ్ తదితర మహిళలు కారుమూరికి నుదుటిన కుంకుమ పెట్టి అనంతరం రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కారుమూరి వారికి మిఠాయిలు అందజేశారు.

అప్యాయత, అనురాగాల మధ్య రాఖీ పండుగ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సోదర, సోదరీమణులు అప్యాయత, అనురాగాలకు, బాంధవ్యానికి ప్రతీక రక్షాబంధన్. ఆనందంలోనే కాదు, కష్టాల్లో కూడా తోడు నిలుస్తానని, నేను నీకు, నువ్వు నాకు రక్ష అంటూ, నన్ను విడిచి ఉండకు అని చెల్లెళ్లు అన్నయ్యలకు, అక్కలు తమ్ముళ్లకు రక్ష బంధన్‌తో రాఖీ పట్టీని కట్టడం ద్వారా తమ అభిమానంను, ప్రేమను వ్యక్తం చేశారు. అన్న, తమ్ముళ్లకు స్వీట్లు తిన్పించారు. తమ అనురాగాలతో, అప్యాయతలతో చీరలు, నగదు, వెండి, బంగారు వస్తువులను బహుమతులు అందుకున్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఈ.స్వరాజ్యలక్ష్మి అన్నారు. అసిస్టెంట్ కమీషనర్ కేవీ నాగ ప్రభు కుమార్ ఆదేశాలు మేరకు శనివారం పట్టణంలోని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో దీక్ష డి-అడిక్షన్ అండ్ డ్రగ్ రీహాబిలిటేషన్ సెంటర్‌నందు మద్యపాన, మత్తు పదార్థాల వ్యసనం, వ్యసన విముక్తి కొరకు కేర్ అనే అంశంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. యువకులు దేశ ప్రగతికి పాటుపడాలని చెప్పారు. కష్టపడి జీవించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని, కుటుంబాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాలకు యువశక్తి దూరంగాఉంటూ నిర్వీర్యం కాకుండా సమాజహితం కోసం పనిచేయాలని కోరారు. సొసైటీవారిచే ఉచితంగా చేస్తున్న సేవలను కొనియాడారు. సెంటర్‌లో చికిత్స పొందుతున్నవారికి పండ్లను అందజేశారు. కార్యక్రమంలో సబ్ ఇనస్పెక్టర్లు జి.మురళీ మోహన్‌రావు, ఆర్.దొరబాబు, సిబ్బంది, సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

వేలానికి ద్విచక్ర వాహనం

తణుకు అర్బన్: మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనానికి ఈనెల 14వ తేదీన తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. 2023 సంవత్సరానికి చెందిన టీవీఎస్ జ్యూపిటర్ వాహనం వేలంవేయనున్నామని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర రూ. 50 వేలకు పైబడి అధికంగా పాడిన వారికి ఈ వాహనం కేటాయించబడుతుందని చెప్పారు. వేలంలో పాల్గొనేవారు వాహనం పాడిన ధరపై 18 శాతం జీఎస్టీ చెల్లించాలని, పాడిన ధరతోపాటు జీఎస్టీని ఆదేరోజు వెంటనే చెల్లించాలని చెప్పారు. ఆసక్తికలవారు తమ ఆధార్ కార్డుతో వేలానికి హాజరుకావాలని, ఇతర వివరాలకు తణుకు ఎక్సైజ్ కార్యాలయ ఎస్సై 94409 02436 నంబరులో సంప్రదించాలని కోరారు.

12న నులిపురుగుల నివారణ దినోత్సవం



ఆరోగ్య సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న డా.అనీషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 12వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనీషా కోరారు. స్థానిక కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కడకట్ల పరిధిలో అంగన్‌వాడీ సెంటర్స్, స్కూల్స్, కళాశాలలకు ఇచ్చేందుకు అల్బెండాజోలు మాత్రలు 6700 డోసులు సిద్ధం చేసినట్లు, మొదటి రోజునే 99 శాతం డోసులు అందజేయాలని, ఎవరైన మిగిలిన వారు ఉంటే 20వ తేదీ బుధవారం రోజున వారికి కూడా అందజేయాలని, నూటికినూరుశాతం కంప్లీట్ చేయాలని తెలిపారు. నులిపురుగులు వల్ల రక్తహీనత వస్తుందని, పోషకాహార లోపలు ఉంటాయని, వీటి కారణంగా పిల్లలు అనారోగ్యం భారీనపడతారని, తప్పనిసరిగా డోస్‌లు పిల్లలకు అందజేయాలని కోరారు. ఇది ఇలా ఉంటే పట్టణంలోని మిగిలిన మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌లలో యాగర్లపల్లిలో 5,315 డోస్‌లు, వీకర్స్‌కాలనీ 5400 డోస్‌లు, బేబీ సెంటర్ (ఎన్‌టీఆర్) జంక్షన్ పరిధిలో 3,233 డోస్‌లు పిల్లలకు అందజేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

నిట్‌లో నిషేధాజ్ఞలపై ఎంపీ ఆగ్రహం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్‌లో మూడేళ్లుగా నిషేధాజ్ఞలు అమలు చేస్తుండటంపై రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన నిట్ ప్రాంగణం, పరిపాలన విభాగాన్ని పరిశీలించారు. ఆంధ్రా, ఉస్మానియా వంటి యూనివర్సిటీల్లో సైతం లేని నిషేధాజ్ఞలు ఇక్కడ ఎందుకని ప్రశ్నించారు. నిషేధాజ్ఞలపై మానవ వనరుల శాఖ మంత్రిత్వ శాఖ అధికారులు, నిట్ ఉన్నతాధికారులతో విచారణ జరపాలని తాను కోరతానన్నారు. కొన్నేళ్లుగా నిట్‌లో ఉద్యోగుల పదోన్నతి నిలిచిపోయిందని, మూడేళ్లకు పైగా డైరెక్టర్ లేక పరిపాలన కుంటుపడిందని, నిధులు ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పారు.

గిరిజనులు విద్యావంతులు కావాలి



ఆదివాసీ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వరప్రసాద్



నన్నయ్య యూనివర్శిటీలో గిరిజన దినోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్: ఆదివాసీ గిరిజనులు విద్యావంతులు కావాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు నరహరి వరప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలోని ఏకలవ్యుని విగ్రహం వద్ద ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరి వరప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులు తమ బిడ్డలను విద్య వైపు ప్రోత్సహించాలన్నారు. తద్వారా సమానత్వం సాధ్యపడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సుబ్బారావు మాట్లాడుతూ గురు దక్షిణగా బొటన వేలును సమర్పించిన మహనీయుడు ఏకలవ్యుడని కొనియాడారు. ఆయనను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గిరిజనులు తమ పిల్లల్ని వృత్తి వైపు కాకుండా విద్య వైపు ప్రోత్సహించాలన్నారు. తొలుత ఏకలవ్యుని విగ్రహానికి నరహరి వరప్రసాద్, సింగం సుబ్బారావు, జగన్, కూటమి నాయకులు అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

నన్నయ్యలో గిరిజన దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్‌లో శనివారం అంతర్జాతీయ గిరిజన దినోత్సవం–2025ను జరిపారు. క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆధ్వర్యంలో స్వదేశీ ప్రజలు, కృత్రిమ మేధస్సు, హక్కులను కాపాడుకోవడంకోసం, భవిష్యత్తును రూపొందించడం అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.అశోక్ మాట్లాడుతూ వివిధ రంగాలలో ప్రతిభ చాటాలన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, డిపార్ట్‌మెంట్ కోర్సు కోఆర్డినేటర్, ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

14న దివ్యాంగులకు కంటి పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సక్షమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని రకాల దివ్యాంగులకు ఈ నెల 14వ తేదీ రెండోవ గురువారం స్థానిక డీఎస్ చెరువు సత్యసాయి మందిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని, సక్షమ్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కేఎస్‌కేఎస్ అప్పారావు ఒకప ప్రకటనలో తెలిపారు. కంటిలో పొలు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడ్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫొన్ నెంబర్లు 80085 94924, 90145 61999లను సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం



మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగాల్సిందేనని ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ దశలవారీ ఆందోళనా కార్యక్రమంలో భాగంగా శనివారం టూల్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మికులు పనిముట్లు ముందు పెట్టుకుని మునిసిపల్ కార్యాలయం వద్ద బైఠాయించారు. వక్తలు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, కొత్త పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల పోస్టులను వారు కుటుంబసభ్యులకు ఇవ్వాలని, సిబ్బంది సంఖ్యను పెంచాలనీ, వాహనాలు కండిషన్‌ను మెరుగుపర్చాలని, తదితర డిమాండ్లను అమలుచేయలని కోరుతూ కార్మికుల పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఉద్యోగ, కార్మిక వర్గాల సమస్యలను ఇంత వరకూ అజెండాలోకి తీసుకోకపోవడం విచారకరమన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే మునిసిపల్ కార్మికుల సమ్మెకు దిగక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టంచేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ మునిసిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, కాంట్రాక్ట్ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, సంక్షేమపథకాలు అమలు చేయాలన్నారు. ఏరియా కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, మునిసిపల్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

19న హలో మాల- చలో ఢిల్లీ



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఢిల్లీలో ఈ నెల 19వ తేదీన నిర్వహించే హలో మాల చలో ఢిల్లీను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మంగరాజు మాట్లాడుతూ ఛలో ఢిల్లీకు రెండు తెలుగు రాష్ట్రాలలోని మాలలంతా ఒకే తాటిపైకి రావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాల మాదిగలను విడదీసే కుట్ర నేడు కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు పుష్పరాజు, కటికతల రాజారావు తదితరులు పాల్గొన్నారు.